సాక్షి పల్నాడు

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



ఎస్పీని కలసిన పీఎస్ఐలు

నగరంపాలెం: గుంటూరు జిల్లాలోని స్టేషన్లలో శిక్షణ పొందుతున్న పీఎస్ఐలు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.



ముంపు పొలాలు పరిశీలన

కొల్లిపర: మండలంలోని పలు గ్రామాల్లో ముంపునకు గురైన ఉద్యాన పంటలను జిల్లా ఉద్యాన అధికారి జి.రవీంద్రబాబు సోమవారం పరిశీలించారు.



ఘనంగా చండీ హోమం

నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం చండీహోమం నిర్వహించారు.

న్యూస్‌రీల్

శ్రీరాముడిని తాకిన సూర్యకిరణాలు



బల్లికురవ: దసరా శరన్నవరాత్రులు, మూలా నక్షత్రం సందర్భంగా సోమవారం మండలంలోని కొత్తపాలెం రామాలయాన్ని సూర్యకిరణాలు తాకాయి. దక్షిణాయన పుణ్యకాలంలో పర్వదినాన సూర్యకిరణాలు శ్రీరామ చంద్రస్వామిపై పడటం ఎంతో శుభపరిణామమని ఆలయ అర్చకులు ఐనవోలు సుబ్బాచార్యులు శివసాయి అన్నారు. పంచామృతాలతో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, హరిద్రా చూర్ణ లేపనం అష్టోత్తర శతనామ పూజ, ప్రత్యేక అలంకరణ, దివ్యమంగళ హారతి చేపట్టారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



బాపట్ల: సచివాలయం ఉద్యోగులు ఆత్మగౌరవ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద, మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. సచివాలయంలో వలంటీర్లను తొలగించి వారు చేసే ప్రతి పనిని తమతో చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందిపై సర్వేల భారం పెట్టి మరీ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. పని ఒత్తిడితో తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు.

నూతన ఉపాధ్యాయులకు అభినందన



గుంటూరు వెస్ట్: జిల్లాలో ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ద్వారా కోచింగ్ తీసుకుని ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆఫ్ లైన్‌లో 117 మందికి, ఆన్‌లైన్‌లో 217 మందికి డీఎస్సీ కోచింగ్ అందించారు. వీరిలో సెకండరీ గ్రేడ్ టీచర్స్ 14 మంది, స్కూల్ అసిస్టెంట్‌గా నలుగురు ఉద్యోగాలు పొందారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయటంతోపాటు బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వారికి సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, బీసీ సంక్షేమశాఖ అధికారి మయూరి పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పండుగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విజయవాడ మీదుగా వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు విజయవాడ డివిజన్ పీఆర్‌ఓ నుస్రత్ మండ్రూప్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- సికింద్రాబాద్ - అనకాపల్లి (07059) ప్రత్యేక రైలు అక్టోబర్ 6, 13, 20, 27 తేదీల్లో ప్రతి సోమవారం రాత్రి ఏడు గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు అనకాపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07060) 7, 14, 21, 28 తేదీల్లో ప్రతి మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు అనకాపల్లిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8.40 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. రెండు మార్గాల్లో ఈ రైలు చర్లపల్లి, పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, కృష్ణా కెనాల్, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి స్టేషన్లలో ఆగుతుంది.

జ్ఞాన ప్రదాయిని సరస్వతీదేవి



సరస్వతీదేవి అలంకారంలో బాలచాముండేశ్వరీదేవి



పిడుగురాళ్లలోని వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద కుంకుమ పూజ నిర్వహిస్తున్న మహిళలు



పెదమక్కెనలోని మల్లికార్జునస్వామి దేవాలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు



సత్రశాల దేవస్థానంలో సామూహిక అక్షరాభ్యాసంలో చిన్నారులు

భక్త జనుల అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానజ్యోతిని వెలిగించే జ్ఞాన ప్రదాయినిగా సరస్వతీదేవిగా భక్తులకు అమ్మవారు సోమవారం దర్శనమిచ్చారు. అమరావతిలోని బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో బాలచాముండేశ్వరి అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవి ఖడ్గమాల, లలితా సహస్ర నామార్చన, శ్రీచక్రార్చన తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్ధిని అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాలోని పలు ఆలయాలలో కూడా సరస్వతీదేవిగా అమ్మవారు భక్తులను కటాక్షించారు. – అమరావతి/ పిడుగురాళ్ల/రెంటచింతల/ సత్తెనపల్లి

పింఛన్లపైనా అదే వంచన!

- ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏడాదికి రెండుసార్లు కొత్తగా మంజూరు
- ఇప్పుడు పాత వాటినే అనర్హత పేరుతో తొలగిస్తున్న కూటమి సర్కార్
- జిల్లా వ్యాప్తంగా తగ్గిన పింఛనుదారుల సంఖ్య 8,976
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ హామీని అమలు చేయని చంద్రబాబు ప్రభుత్వం
- మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ప్రజల డిమాండ్

ఏడాదిన్నర పాలనలో కొత్తగా మంజూరు చేయని కూటమి ప్రభుత్వం

అధికారంలోకి వచ్చేందుకు సవాలక్ష హామీలు ఇచ్చిన కూటమి నేతలు.. ప్రభుత్వం ఏర్పాటయ్యాక వాటి ఊసే ఎత్తడం లేదు. పైగా అప్పటివరకు అందుకున్న సాయానికి కూడా కొర్రీలు వేస్తున్నారు. పింఛన్ల విషయంలోనూ తన నయవంచన బుద్ధిని చాటుకుంటోంది చంద్రబాబు ప్రభుత్వం. అనర్హత పేరుతో పేదలపై కక్ష సాధిస్తోంది. ఇకనైనా తమకు పింఛన్లు సక్రమంగా అందించాలని సామాన్య, పేద ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సాక్షి, నరసరావుపేట: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక పథకంలో లబ్ధి కలిగించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కులం, మతం, ప్రాంతం, పార్టీ వంటి వివక్ష లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేశారు. పింఛన్ల మంజూరులో స్థానిక నేతల సిఫార్సులు లేకుండా నేరుగా గ్రామ, వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఎప్పటికప్పుడు ఇంటికే వచ్చి అవసరమైన పత్రాలు, వేలిముద్రలు వేయించుకొని పథకానికి అర్హత పొందేలా చేశారు. ఏటా రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరు అయ్యేవి. ఏదైనా సాంకేతిక కారణంతో పింఛన్ నగదు అందకపోతే ద్వైవార్షిక లబ్ధి పేరిట ఆ ఆరు నెలల్లో నష్టపోయిన మొత్తం చెల్లించారు. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నారవుతున్నా కొత్త పింఛన్ల దరఖాస్తుకు అవకాశం కల్పించలేదు. కనీసం ఎప్పుడు ఇస్తారో, ఎలా, ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలో చెప్పేవారు లేరు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా వేలాది మంది పింఛన్ పథకానికి అన్ని అర్హతలు ఉండి కూడా ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఇంటికే పింఛన్ నగదు అందజేసే వలంటీర్ల వ్యవస్థను కూటమి ప్రభుత్వం పక్కనపెట్టడంతో సచివాలయ ఉద్యోగులు వీధుల్లో నిలబడి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యం...



వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా సామాజిక పింఛన్ల తొలగింపు ప్రక్రియ చేపడుతున్నారు. ఎవరో ఓ టీడీపీ నేత తమ పరిధిలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల లిస్ట్ అందజేస్తే వారందరికీ అధికారులు నోటీసులు అందజేస్తున్నారు. దివ్యాంగులకు మరోసారి వైద్యుల నుంచి సర్టిఫికెట్ తీసుకొని సమర్పించాలని అడుగుతున్నారు. ఇలా గతంలో ఎన్నడూ లేని విధంగా నోటీసులు ఇవ్వడం పట్ల ప్రజలు, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక జూన్‌కు సంబంధించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంపికచేసిన 2,82,126 మంది లబ్ధిదారులకే జూలై నెలకు పింఛన్ సొమ్ము మంజూరైంది. ప్రస్తుతం వాటి సంఖ్య 2,73,150 మందికి చేరింది. ఏడాదిన్నరలో కొత్తగా అర్హత సాధించిన వారి సంఖ్య పెరగాల్సిందిపోయి 8,976 వరకు తగ్గింది. వీరిలో కొంతమంది చనిపోయారనుకున్నా.. అంతమంది తగ్గే అవకాశం లేదు. అర్హులను తొలగించే ప్రక్రియ ఆపేసి, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న వాటినీ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులనే నెపంతో వేల సంఖ్యలో జాబితా నుంచి తీసేస్తున్నారు.

మాట తప్పిన కూటమి పాలకులు

టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలలో అర్హత ఉన్న వారందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టారు. ఎన్నికల ప్రచారంలో వాగ్దానాలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాదైనా ఇప్పటివరకు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. చంద్రబాబు సర్కార్ పింఛన్ సౌకర్యం కల్పిస్తుందని ఆశపడిన బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఆ పేదలను మోసం చేశారు. బాబు మోసాలపై గత అనుభవాలు తెలిసినా సూపర్-6 పథకాల పేరిట అరచేతిలో వైకుంఠం చూపి, ఓటేసిన ప్రజలను మరోసారి నిండా ముంచారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్‌కు అర్హత కల్పించి ఉంటే నెలకు రూ.4 వేల చొప్పున ఏడాదికిగాను ఒక్కో కుటుంబానికి రూ.48 వేల ఆర్థిక సహాయం ప్రభుత్వం నుంచి అంది ఉండేది. కూటమి ప్రభుత్వ తీరుతో జిల్లాలో సుమారు 2 లక్షల మందికిపైగా అర్హులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. దీన్ని అమలు చేయకపోవడంతో జిల్లాలో అర్హులైన వారు ఏడాదికి సుమారు రూ.960 కోట్ల కోల్పోయారు.

కొత్త పింఛన్లు ఏవి..?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏడాదిలో రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. అర్హతే ప్రామాణికంగా ఏటా జనవరి, జూలై నెలల్లో ఎలాంటి సిఫార్సు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరిగేది. గ్రామ, వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఎక్కడికి వెళ్లాల్సిన పనిలేకుండా, ఎవర్నీ కలవాల్సిన పనిలేకుండా పింఛన్‌కు అర్హత సాధించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లాలో దరఖాస్తులు స్వీకరించి ఒక్కటంటే ఒక్క పింఛన్‌కు కూడా మంజూరు చేయలేదు. అన్ని అర్హతలు ఉండి ప్రభుత్వం కొత్త పింఛన్లను మంజూరు చేయకపోవడంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. కనీసం ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పలేని దుస్థితి నెలకొంది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు గ్రామ, వార్డు సచివాలయాలు, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాలేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అన్యాయంగా తొలగింపు



మా గ్రామంలో 40 మంది చర్మకారులకు పింఛన్లు వస్తున్నాయి. టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారన్న నెపంతో నాతోపాటు నలుగురికి ఎంపీడీఓ గత వారం నోటీసులు పంపారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులన్న అక్కసుతో అర్హులైన పేదల పింఛన్లను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారు. చర్మకారుడి గుర్తింపు కార్డు గత చంద్రబాబు ప్రభుత్వంలోనే మంజూరు చేశారు. ఇప్పుడు నేను ఎందుకు అనర్హుడిని?

– దారా మోషే, చర్మకారుడు, వయకల్లు గ్రామం, శావల్యాపురం మండలం

కొత్తవి ఎప్పుడిస్తారో?



నేను చాలా పేదవాడిని, రంపపు మిల్లులో పనులకు వెళతాను. వయసు పెరుగుతుండటం, మిల్లులో పనులు చేయడంతో ఆరోగ్యం క్షీణించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్ ఇస్తారని ఎదురుచూసినా ఫలితం లేకుండాపోయింది. ఇప్పటివరకు దరఖాస్తు కూడా నాలాంటి వారి నుంచి తీసుకోలేదు. ప్రభుత్వం ఎప్పుడు కొత్త పింఛన్లు మంజూరు చేస్తుందా అని ఎదురుచూస్తున్నా.

– షేక్ దరియా హుస్సేన్, క్రోసూరు, పెదకూరపాడు నియోజకవర్గం

పల్నాడు జిల్లాలో తగ్గుతూ వస్తున్న పింఛన్ల సంఖ్య ఇలా....

నెల	జూలై-2024	నవంబరు-2024	సెప్టెంబర్-2025
పింఛన్ల సంఖ్య	2,82,126	2,75,070	2,73,150

జలదిగ్బంధంలో తండాలు



మత్స్యకారుల కాలనీలో నిలిచిపోయిన వరద నీరు

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. సోమవారం ఎగువ నుంచి ప్రాజెక్టుకు 5,92,610 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 5,69,340 క్యూసెక్కులు 16 గేట్లను 5 మీటర్ల మేర పైకెత్తి వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి దిగువకు భారీగా నీటిని వదలడంతో కృష్ణానదికి వరద ఎక్కువైంది. కంచుబోడు, జడపల్లి తండాలు జల దిగ్బంధంలో ఉన్నాయి. తాడువాయిలో పత్తి పంటలలో నీటినిల్వ యథాతథంగా ఉంది. చేపలు పట్టే వారు కూడా తమ పడవలను ఒడ్డుకు చేర్చుకున్నారు. మరో రెండు, మూడు రోజులపాటు పరిస్థితులు ఇదే విధంగా ఉంటాయని, తాము చెప్పే వరకు నదిలో పడవలు, బల్లకట్టు వంటి సాధనాలను నడపరాదని అచ్చంపేట సీఐ శ్రీనివాసరావు, తహసీల్దారు ఎస్.చంద్రశేఖర్‌లు హెచ్చరికలు జారీ చేశారు.

దాచేపల్లి: మండలంలోని రామాపురం మత్స్యకారుల కాలనీని వరద నీరు వీడలేదు. సోమవారం కూడా కాలనీతోపాటుగా చుట్టు పక్కల వరద నీరు ప్రవహిస్తూనే ఉంది. కృష్ణానదిలో వరద నీరు పెరగటంతో ఇళ్లల్లోకి నీళ్లు వచ్చాయి. స్థానికులు ఇళ్లను ఖాళీ చేసి పునరావాస కేంద్రానికి వెళ్లారు. వరద ఉధృతి ఇంకా తగ్గకపోవటంతో అక్కడే ఉన్నారు. పరీవాహక ప్రాంతాల్లో ఉన్న పంటపొలాలు నీట మునిగాయి. పత్తి పంట మునగటంతో పూత, పిందెలు రాలిపోయాయి. మిరప మొక్కలు ఉరకెత్తాయి. తహసీల్దార్ కె. శ్రీనివాస యాదవ్ పరిస్థితిని సమీక్షించారు. రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు.



తాడువాయి వద్ద నీట మునిగిన పత్తి పంట

పల్లెల్లో వైద్యంపై సమ్మెట

- సమ్మె సైరన్ మోగించిన పీహెచ్‌సీ వైద్యులు
- సీజనల్ వ్యాధుల కాలంలో సేవలకు ఆటంకం
- గ్రామీణ ప్రాంత ప్రజలకు తప్పని అవస్థలు
- జిల్లాలోని 39 పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు బంద్

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే వైద్యుల సమస్యలు నయం కాని దీర్ఘకాలిక వ్యాధుల్లా మారాయి. ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) ఆధ్వర్యంలో వైద్యులు సమ్మె సైరన్ మోగించారు. సోమవారం నుంచి సమ్మెలోకి వెళ్లడంతోపాటు ఓపీ సేవలకు స్వస్తి పలికారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యుల విషయంలో ప్రభుత్వ వహిస్తున్న నిర్లక్ష్యం కారణంగా వైద్యులు సోమవారం సమ్మెలోకి దిగారు. మరోవైపు సీజనల్ వ్యాధులు పట్టిపీడిస్తున్న తరుణంలో వైద్యులు సమ్మెలోకి వెళ్లడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినా డిమాండ్లను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చొరవ చూపడం లేదు. జిల్లాలో 39 పీహెచ్‌సీలు, 26 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. పీహెచ్‌సీల పరిధిలో దాదాపు 110 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యులు పీజీ కోర్సులు చేసేందుకు గతంలో క్లినికల్‌లు 30 శాతం, ఫిజియాలజీ, ఎనాటమీ, ఫార్మసీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్ తదితర నాన్ క్లినికల్‌లకు 50 శాతం సీట్లు ఉండేవి. కూటమి ప్రభుత్వం గతేడాది క్లినికల్‌లు 15 శాతానికి, నాన్ క్లినికల్‌లు 30 శాతానికి తగ్గించింది. అప్పట్లో వైద్యులు ఆందోళనకు దిగడంతో క్లినికల్ 20 శాతానికి పెంచారు. తాజాగా మళ్లీ 15 శాతానికి తగ్గించేసినట్లుగా ఏపీపీహెచ్‌సీడీఏ చెబుతోంది. సీహెచ్‌సీలో పని చేస్తే మూడు, నాలుగేళ్లకే డిప్యూటీ సివిల్ సర్జన్‌గా ప్రమోషన్ ఇస్తుంటే... 20 ఏళ్లుగా పీహెచ్‌సీల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్నా పదోన్నతులు రాక సీనియర్ మెడికల్ ఆఫీసర్స్‌గానే మిగిలిపోతున్నామని ఆవేదన చెందుతున్నారు.



పెదకూరపాడు మండలం రామాపురంలో వైద్యులు లేకుండానే 104 సేవలు అందిస్తున్న దృశ్యం

సేవలను గుర్తించని కూటమి ప్రభుత్వం...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన సర్వేలు, పల్స్‌పోలియో, వరదలు, విపత్తుల సమయంలో క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు పదోన్నతులు రావడం లేదని వారు వాపోయారు. విధుల్లో చేరిన నాటి నుంచి ఉన్న క్యాడర్‌లోనే రిటైర్ అవుతున్న పరిస్థితి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు ముసురుకుంటున్నాయి. ప్రధానంగా ప్రతి పల్లె జనం విష జ్వరంతో అల్లాడిపోతున్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు జ్వరం బారిన పడ్డారు. జేబులో డబ్బులు ఉంటే ఆర్ఎంపీ, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. ఆర్థిక స్తోమత లేని వారంతా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు క్యూ కడుతున్నారు. ఈ మధ్య కాలంలో జ్వరం కేసులు పెరిగాయి. ఇలాంటి తరుణంలో వైద్యుల సమ్మె పేద రోగులకు ఇబ్బందికరంగా మారనుంది. ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థిక ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం పట్ల ప్రజలు విస్తుపోతున్నారు.

జిల్లాలో పీహెచ్‌సీల వివరాలు

జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	: 39
ఒక కేంద్రంలో కనీస వైద్యులు	: 02
మొత్తం పని చేస్తున్న వైద్యులు	: 110
లభించే మందుల రకాలు	: 174
నిత్యం ఓపీ రోగులు: సగటున 40-50 మంది	

అత్యవసర సేవలకు ఇబ్బంది లేదు

జిల్లాలోని పీహెచ్‌సీలో వైద్యులు ఓపీ సేవలు మాత్రమే నిలిపివేశారు. అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఓపీ సేవలకు పీహెచ్‌సీలో మిగిలిన సిబ్బంది ఉంటారు. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో చర్చలు జరుపుతోంది. పూర్తి స్థాయిలో సమ్మెలోకి వెళ్లలేదు. రెండు రోజుల్లో అతా తెలుస్తుంది.

– డాక్టర్ బి.రవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, పల్నాడు

ఫిర్యాదులపై జీరో శ్రద్ధ

కొందరు పోలీసుల అంతులేని నిర్లక్ష్యం జీరో ఎఫ్‌ఐఆర్‌ను వెక్కిరిస్తోంది. బాధితులకు సత్వర న్యాయం అందాలనే లక్ష్యాలకు తూట్లు పొడుస్తోంది. మా పరిధి కాదంటూ పక్కకు తప్పుకునే ఉదాసీనతకు జీరో ఎఫ్‌ఐఆర్ పేపరు పులిగా మాత్రమే మిగిలిపోతోంది. వేగవంతంగా బాధితులకు దక్కాల్సిన న్యాయం నెలల తరబడి నిరీక్షణలకే పరిమితమవుతోంది. ఇలా జీరో ఎఫ్‌ఐఆర్ పై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేక, అమలు చేయాల్సిన పోలీసు అధికారులు పట్టించుకోక బాధితులను జీరోలను చేస్తోంది.

'జీరో ఎఫ్‌ఐఆర్'కు మంగళం పాడుతున్న పోలీసులు

- తమ ప్రాంతం కాదంటూ దాటవేస్తున్న వైనం
- పోలీసు స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న బాధితులు
- కేసు నమోదు ఆలస్యంతో అందని న్యాయం
- ప్రతిపక్షాలపై మాత్రం యథేచ్ఛగా నమోదు.. వేధింపులు
- మండిపడుతున్న ప్రజలు

నరసరావుపేట టౌన్: ప్రజలకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో ప్రవేశ పెట్టిన జీరో ఎఫ్‌ఐఆర్ విధానం రాష్ట్రంలో పూర్తిగా అమలుకు నోచుకోకుండా కాగితాలకే పరిమితం అవుతుంది. నేరం ఎక్కడ జరిగినా సమీపంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసిన తర్వాత సంబంధిత పోలీస్ స్టేషన్‌కు కేసు బదిలీ చేయాలి. అయితే ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ మెట్లు ఎక్కితే మాపరిధి కాదు.. అనే పదం పోలీసుల నుంచి బాధితులకు వినిపిస్తుంది. పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరుగుతూ చివరకు నిరాశతో ఉన్నతాధికారులను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది. ఫలితంగా న్యాయం పొందాల్సిన వారు నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తుంది. నేరస్తులు మాత్రం స్వేచ్ఛగా బాహ్య ప్రపంచంలో తిరుగుతున్నారు. ఏదైనా నేరం ఎక్కడ జరిగిందనేది పక్కన పెడితే సమీపంలో ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా బాధితులు వెళ్లి ఫిర్యాదు చేయగానే జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాల్సి ఉంది. ఈ అంశంపై స్పష్టమైన ఆదేశాలు ఉన్నా పోలీసులు విస్మరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మాది కాదు పొమ్మంటూ..

నరసరావుపేటకు చెందిన ఓ మహిళా న్యాయవాది తన కుమార్తెతో కలిసి స్కూటీపై వెళుతుండగా మల్లమ్మ సెంటర్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో వెంటనే స్థానిక వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే వారు సంఘటన జరిగిన ప్రాంతం తమ పరిధి కాదని, టూటౌన్ పరిధి అని సలహా ఇచ్చారు. వెంటనే టూటౌన్‌కు పీఎస్‌కు సమచారమివ్వగా... వారు స్పందిచలేదు. దీంతో సదరు న్యాయవాది ఈ విషయం సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ.. ఇదేనా జీరో ఎఫ్‌ఐఆర్ అంటే అని నిలదీశారు.

డాక్టర్‌కు ఎదురైన చేదు అనుభవం..

నంద్యాల జిల్లా సున్నిపెంటకు చెందిన డాక్టర్ బాడిస శ్రీనివాస్ ఈ ఏడాది మార్చి 18వ తేదీన విజయవాడ నుంచి శ్రీశైలం వెళుతూ నరసరావుపేటలో బస్సు మారాడు. స్వగ్రామంలో బస్సు దిగి బ్యాగ్ చూసుకోగా అందులో ఉండాల్సిన 320 గ్రాముల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. వెంటనే వెళ్లి స్థానిక పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేస్తే అక్కడ పోలీసులు కేసు నమోదు చేసేందుకు తిరస్కరించారు. దీంతో నరసరావుపేట వచ్చి జరిగిన విషయం చెబితే .. సంఘటన జరిగిన ప్రదేశానికి వెళ్లి ఫిర్యాదు చేసుకోవాలని సలహా ఇచ్చారు. ఇలా నాలుగు నెలలపాటు ఎవరూ కేసు తీసుకోకపోవడంతో బాధితుడు ఉన్నతాధికారులను ఆశ్రయించా డు. తప్పనిసరి పరిస్థితుల్లో శ్రీశైలం పోలీసులు కేసు నమోదు చేసి నరసరావుపేటకు బదిలీ చేశారు. ఈ లోగా దొంగలు మాత్రం చోరీ చేసిన సొత్తుతో జల్సా చేశారు.

'యానిమేషన్' లోనూ అదే తీరు

అదేవిధంగా విజయవాడ కేంద్రంగా యానిమేషన్ కేంద్రం ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేసి నరసరావుపేటలో ఏజెంట్ల ద్వారా రూ.కోట్ల పెట్టుబడులు పెట్టించుకున్నారు. మోసపోయిన బాధితులు మొట్టమొదటి సారి నరసరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా విజయవాడ వెళ్లాలని సూచించారు. పల్నాడు జిల్లా ఎస్పీని కలసి విన్నవించుకున్నా ప్రయోజనం దక్కలేదు. ఇలా పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ పై అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.



వైఎస్సార్ సీపీ నేతలపై ఒంటి కాలిపై...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పోలీసులు వైఎస్సార్ సీపీ నాయకులపై ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒంటి కాలిపై దూకుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రశ్నించే సోషల్‌మీడియా యాక్టివిస్టులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కూటమి నేతలు ఫిర్యాదు చేయగానే పోలీసులకు జీరో ఎఫ్‌ఐఆర్ గుర్తుకొస్తోంది. సంఘటనలకు పరిధితో సంబంధం లేకుండా స్థానికంగా కేసులు నమోదు చేస్తున్నారు. ఒకే సంఘటనపై అనేక పోలీసు స్టేషన్లలో తప్పుడు కేసులు నమోదు చేసి ఇప్పటికే అక్రమంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలను జైలు పాలు చేశారు. కేవలం ప్రతిపక్షంపై కక్షసాధింపు కోసం మాత్రమే చట్టాలను అక్రమంగా ఉపయోగిస్తున్నారు. నష్టపోయిన బాధితులు స్థానిక పోలీసు స్టేషన్ల చుట్టూ తిరిగినా, ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌లో జిల్లా పోలీసు అధికారులకు మొరపెట్టుకున్నా వారి సమస్యలకు పరిష్కారం దక్కడం లేదు. జీరో ఎఫ్‌ఐఆర్ ప్రజలకు రక్షణ కల్పించేందుకు ప్రవేశపెట్టిన చట్టపరమైన సాధనం. కాని ప్రస్తుతం అది జీరో న్యాయం.. జీరో నమ్మకం అన్న పరిస్థితి తెచ్చిందని పలువురు బాధితులు వాపోతున్నారు.

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం కావాలి



కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న అర్జీదారులు

- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా
- పీజీఆర్ఎస్‌లో 125 అర్జీలు స్వీకరణ

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 125 అర్జీలు జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, ఇతర జిల్లా అధికారులతో కలసి స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావు లేకుండా నాణ్యత, అర్జీదారుని సంతృప్తే ధ్యే యంగా అర్జీల పరిష్కార తీరు ఉండాలని స్పష్టం చేశా రు. అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నా రు. డీఆర్ఓ మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో తోటల పెంపకం నిలిపివేయండి



ఇనిమెళ్ల గ్రామ పరిధిలోని 90 సెంట్ల ప్రభుత్వ భూమిలో కొంతమంది వ్యక్తులు బోర్లు వేసి బత్తాయి తోటలు వేస్తున్నారు. వాటిని ఆపించి భూమిని సర్వే చేయించి ఆ భూమి ఆక్రమణకు గురికాకుండా కాపాడండి.

–జి.వెంకటహనుమయ్య, పలువురు గ్రామస్తులు, ఇనిమెళ్ల, ఈపూరు మండలం

యానిమేటర్‌పై చర్య తీసుకోండి

మేము 10 మందిమి 15 ఏళ్లుగా శ్రీ కనకదుర్గా డ్వాక్రా సమాఖ్య సభ్యులుగా ఉంటుండగా యానిమేటర్ ఇటీవల మాకు తెలియకుండా మా డబ్బులు బ్యాంకులో జమ చేయకుండా రూ.61వేలు కాజేసింది. బ్యాంకు అధికారులు తెలియచేశారు. ఆమెపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయండి.

–శ్రీలత, విజయలక్ష్మి, పద్మ, ఇందిర, శ్రీకనకదుర్గా సమాఖ్య సభ్యులు, అంచలవారిపాలెం, రాజుపాలెం మండలం

నేడు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆందోళన

మెడికల్ కళాశాలల ప్రైవేటు పరంపై నిరసన

నరసరావుపేట: ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేయాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మంగళవారం ఉదయం జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నేతల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతుందని పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, కూటమి ప్రభు త్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని నిరసిస్తూ ధర్నా చేస్తామని తెలిపారు. జిల్లాలోని ఎస్సీ సోదరులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ ట్రెక్కింగ్ క్యాంపునకు ఎన్ఈసీ క్యాడెట్స్ ఎంపిక

నరసరావుపేట రూరల్: జాతీయ ట్రెక్కింగ్ క్యాంప్‌నకు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల(ఎన్ఈసీ)కు చెందిన ముగ్గురు ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ నుంచి ట్రెక్కింగ్ క్యాంప్ జరగనుంది. ఈ క్యాంప్‌నకు కళాశాలకు చెందిన క్యాడెట్స్ జి.రమ్యశ్రీ, జి.హరిక, సిహెచ్ హంసిక రెడ్డిలు ఎంపికయ్యారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎంవీ కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్ బాబు, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట మేడికొండ రాజేష్, అధ్యాపకులు అభినందించారు.

మోసపోయాం.. న్యాయం చేయండి

- జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్
- ఫిర్యాదులు స్వీకరించిన అడిషనల్ ఎస్పీ జేవీ సంతోష్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్

నరసరావుపేట రూరల్: ఆర్థిక మోసాలపై పలు ఫిర్యాదులు జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందాయి. జిల్లా అదనపు(అడ్మిన్) ఎస్పీ జేవీ సంతోష్ కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసం తదితర సమస్యలకు సంభందించిన 95 ఫిర్యాదులు అందాయి. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమలో ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీ తెలిపారు. క్రైమ్ అడిషనల్ ఎస్పీ సిహెచ్.లక్ష్మీపతి, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎం.వెంకటరమణలు పాల్గొన్నారు.

జాబ్ ఇప్పిస్తామని మోసం..

జాబ్ ఇప్పిస్తానంటే నమ్మి రూ.4.60లక్షలు మోసపోయినట్టు కనిగిరి మండల ముసలపల్లి గ్రామానికి చెందిన ఆల గోపాల్ ఫిర్యాదు చేసాడు. గుంటూరులో బీటెక్ చదివే సమయంలో మాచర్ల మండలం రాయవరంకు చెందిన యోగేంద్రతో పరిచయం ఉందని, హైద్రాబాద్‌లో కోచింగ్ తీసుకుంటూ క్యాటరింగ్ పనికి వెళ్తున్న తనకు యోగేంద్ర ఉద్యోగం ఇప్పిస్తానని రూ.3.20లక్షలు తీసుకున్నాడని పేర్కొన్నాడు. ఉద్యోగం ఇప్పించే వ్యక్తి పాపకు అనారోగ్యం అనిచెప్పి మరో రూ.1.40లక్షలు తీసుకున్నాడని వివరించాడు. జాబ్ ఇప్పించకుండా మోసం చేసిన యోగేంద్రపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరాడు.

డబ్బులు చెల్లించకుండా యానిమేటర్ మోసం..

రాజుపాలెం మండలం అంచులవారిపాలెంకు చెందిన కనకదుర్గ మహిళా పొదుపు సంఘం మే నెల కిస్తి బ్యాంక్‌కు చెల్లించకుండా యానిమేటర్ పోకల నాగలక్ష్మీ రూ.61వేలు మోసం చేసినట్టు సంఘం మహిళలు అదనపు ఎస్పీకి ఫిర్యాదు చేసారు. గ్రూప్ సభ్యులం రూ.20లక్షలు లోన్ తీసుకుని ప్రతి నెల చెల్లిస్తున్నామని తెలిపారు. మే నేల నగదు గ్రూప్ సభ్యులు యానిమేటర్‌కు ఇవ్వగా ఆమె బ్యాంక్‌లో జమచేయలేదన్నారు. దీని మీద బ్యాంక్ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో యానిమేటర్‌ను ప్రశ్నిస్తే అసభ్య పదజాలంతో ఆమెతో పాటు, ఆమె భర్త దూషించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

లక్కీ స్కీం పేరుతో మోసం ..

చరిష్మా లక్కీస్కీం పేరుతో నిర్వాహకులు 400మందిని మోసం చేసినట్టు బాధితులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసారు. చరిష్మా సూపర్ మార్కెట్ నిర్వాహకులు ఏలూరు స్రవంతి, నాగేశ్వరరావు, నరేంద్రలు లక్కీ స్కీం ప్రారంభించడంతో 400మంది సభ్యులుగా చేరారని, ప్రతి నెల ఒక్కోక్కరు రూ.2వేలు చొప్పున 36 నెలల్లో రూ.72వేలు చెల్లించినట్టు తెలిపారు. 34వ డ్రా నుంచి విజేతలకు నగదు ఇవ్వకుండా, స్కీం సభ్యులకు అందుబాటులో లేకుండా వెళ్లి పోయారని పేర్కొన్నారు. బ్రాంచ్ ఖాళీచేసినట్టు, ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో మోసం పోయామని గ్రహించి ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు.

ఎస్టీ వర్గీకరణ చేసి న్యాయం చేయాలి

నరసరావుపేట: రాష్ట్రంలో వెనుకబడిన యానాదులు అభివృద్ధి చెందాలంటే ఎస్టీ వర్గీకరణ, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటే మార్గమని యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేసి పెంచలయ్య యానాది పేర్కొన్నారు. సోమవారం ఎస్టీ వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన చేసి పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా పెంచలయ్య మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 10లక్షలమందికి పైగా యానాదులు ఉన్నారన్నారు. గిరిజన తెగలలో అత్యధికంగా యానాదులు ఉన్నా సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అన్నింటిలోను వెనుకబడి ఉన్నారన్నారు. ఎస్సీలకు వర్గీకరణ చేసిన విధంగానే ఎస్టీలకు వర్గీకరణ చేస్తే రిజర్వేషన్ పరంగా న్యాయం చేకూరుతుందన్నారు. రాష్ట్ర నాయకులు బాపట్ల బ్రహ్మయ్య, బాకుల మురళి, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అర్జీదారులకు తనిఖీలు

నరసరావుపేట: స్థానిక కలెక్టరేట్‌లో తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే అర్జీదారులకు భద్రతా సిబ్బంది తనిఖీలు తప్పటంలేదు. గత సోమవారం నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ చట్టు బ్రహ్మం కలెక్టరేట్‌కు వచ్చి తనకు వ్యతిరేకంగా తన స్థలానికి వీఆర్ఓ సర్టిఫికేట్ జారీ చేశారంటూ పురుగుమందు సేవించి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై ఇటువంటి సంఘటనలు మరోసారి జరగకుండా అధికారులు భద్రతా చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా కలెక్టర్ కార్యాలయంలోకి ముందు, వెనుక నుంచి ప్రవేశించే గేట్లను మూసేశారు. వెనుక గేటుకు తాళం వేశారు. ముందువైపున పక్కగా ఉన్న గేటు వద్ద భద్రతా ద్వారంను ఏర్పాటుచేసి అందులో నుంచి ప్రతి ఒక్కరూ దాటి వెళ్లేలా ఏర్పాటు చేశారు. దాటి వచ్చిన వారిని క్షుణ్ణంగా తనిఖీచేశారు. మహిళలను ప్రత్యేకంగా మహిళా కానిస్టేబుల్ సహాయంతో తనిఖీ చేశారు.

పశువుల పెంపకం, ఆక్వా రంగంలో వృద్ధి సాధించాలి

నరసరావుపేట: పశువుల పెంపకం, ఆక్వా రంగాల్లో అభివృద్ధికి జిల్లాలో ఉన్న అవకాశాలు వినియోగించుకుని 16 శాతం వృద్ధి సాధించేలా పశు సంవర్ధక, మత్స్య శాఖలు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన పశువులను పెంచడం ద్వారా పాలు, మాంసం ఉత్పత్తి పెంచే అవకాశాలపై దృష్టి సారించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద 2వేల పశువుల షెల్టర్ల నిర్మాణ అనుమతులకు దస్త్రం సమర్పించాలన్నారు. ఈసందర్భంగా సూక్ష్మసేద్య పరికరాలపై జీఎస్టీ తగ్గుదల వలన కలిగే ప్రయోజనాలను గురించి రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకటరావు, మైక్రో ఇరిగేషన్ పీడీ ఆంజనేయులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లాలో కొండమోడు–పేరేచర్ల మధ్య నిర్మిస్తున్న జాతీయ రహదారి 167 ఏజీ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారులు 167 ఏజీ, 167ఏ నిర్మాణ పనులపై సమీక్ష చేశారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో మురళి, జాతీయ రహదారుల ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ సంజీవ రాయుడు పాల్గొన్నారు.

పులిచింతలకు 5,88,988 క్యూసెక్కులు విడుదల

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 18 క్రస్ట్‌గేట్లు ఎత్తి 5,88,988 క్యూసెక్కులు పులిచింతల ప్రాజెక్టుకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ



యడ్లపాడు: మండలంలోని జగ్గాపురం గ్రామంలోని తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు తలుపులు పగులగొట్టి విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రైతు షేక్ బాజీవలి, మీరాబీ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి వివాహాలు కావడంతో కుమారుడు, కోడలు ఉద్యోగం నిమిత్తం దుబాయ్‌లోనూ, కుమార్తె, అల్లుడు వట్టి చెరుకూరు మండలం కుర్నూతల అడ్డరోడ్డు వద్ద చిల్లర కూల్‌డ్రింక్ షాపును ఏర్పాటు చేసుకుని అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం బాజీవలి దంపతులు తమ కుమార్తె ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం 10 గంటలకు జగ్గాపురంలోని ఇంటికి తిరిగి రాగా, రేకుల షెడ్డు ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువా, కప్ బోర్డులో ఉన్న వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దుండగులు కప్‌బోర్డులో దుస్తుల మధ్యలో దాచి ఉంచిన వెండి, బంగారం ఆభరణాలు, నగదు అపహరించుకుపోయినట్లు బాజీవలి గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో యడ్లపాడు ఎస్సై టి.శివరామకృష్ణ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. 130 గ్రాముల బంగారం, 20గ్రాములు వెండి ఆభరణాలు, రూ.6 వేల నగదు చోరీకి గురైనట్లు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.